www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 10 జనవరి 2023
5
ఏలూరు

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శాలంటి అబ్రహం కుమార్(54) గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని పడమటిపాలెంలోని ఆయన నివాసంలో ఉండగా విపరీతమైన ఛాతీనొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే భీమవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అబ్రహంకుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన ఆకస్మిక మృతితో తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 1998 నుండి ఆయన పలు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసి, మంచి గుర్తింపు పొందారు. ఆయనకు కుమార్తె, భార్య అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు బి.స్వర్ణకుమారి, పాఠశాల సిబ్బంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లస్కర్లకు జీతాల్లేవ్..!

పది నెలలుగా అందని పరిస్థితి
డెల్టాలో సాగునీటి పంపిణీలో కీలకపాత్ర వీరిదే
ఒక్కో లస్కర్ పరిధిలో ఐదు వేల ఎకరాల ఆయకట్టు
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 197 మంది లస్కర్ల అవస్థలు
ఏడాదంతా పనిచేసినా పది నెలలకే వేతనాలు
ముఖ్యమంత్రిని కలిసినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని పంటలకు సాగునీరు సరఫరాలో కీలకపాత్ర పోషిస్తున్న కాలువలపై పనిచేసే లస్కర్ల గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారు. పది నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా అడిగే నాథుడే కనిపించడం లేదు. స్వయంగా ముఖ్యమంత్రిని కలిసి తమ గోడు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో లస్కర్లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. గోదావరి నుంచి కాలువల ద్వారా వచ్చే నీటిని స్వయంగా పంపిణీ చేసేందుకు కాలువలపై లస్కర్లను ప్రభుత్వం నియమిస్తోంది. ముఖ్యంగా రబీలో నీటి ఎద్దడి సమయంలో లస్కర్లు ముఖ్య పాత్ర పోషిస్తుంటారు. రాత్రీ, పగలు తేడా లేకుండా కాలువల వద్ద వారు పనిచేస్తారు. ప్రతీ లస్కర్ పరిధిలో ఐదువేల ఎకరాల ఆయకట్టు ఉంటుంది. ప్రతిరోజు కాలువలపై దాదాపు 50 కిలోమీటర్లు తిరగాల్సి ఉంటుంది. వ్యవసాయ సాగులో ఇంతటి కీలక పోషిస్తున్న వీరికి సకాలంలో జీతాలిచ్చే పరిస్థితి లేకపోవడం బాధకరం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 194 మంది వరకూ లస్కర్లు కాలువలపై పనిచేస్తున్నారు. వీరికి గడిచిన పది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో లస్కర్ల కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తమకు ప్రతినెలా ఒకటోతేదీన జీతం ఇవ్వండి మహాప్రభో అంటూ లస్కర్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

దెందులూరు మండలంలోని పంట కాలువ

ఏడాదంతా పని.. పదినెలలకే జీతం

కాలువలపై పనిచేసే లస్కర్లకు ఏడాదిలో పది నెలలకే జీతాలు ఇస్తున్నారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేస్తే ఏప్రిల్ 25వ తేదీ వరకూ కాలువలకు సాగునీరు విడుదల కొనసాగుతుంది. మే నెలలో క్లోజర్ పనుల నిమిత్తం లస్కర్లతో పని చేయించుకుంటున్నారు. కానీ జూన్ నుంచి మార్చి నెలలకు మాత్రమే జీతాలిస్తున్నారు. ఏప్రిల్, మేనెలలో పనిచేయించుకున్నా జీతాలు మాత్రం ఇవ్వడం లేదు. అదేమని అడిగినా సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. లస్కర్లకు నెలకు రూ.10,500 వేతనం మాత్రమే ఇస్తున్నారు. 2017 నుంచి ఇదేజీతం లస్కర్లు అందుకుంటున్నారు. ధరలు విపరీతంగా పెరిగినా లస్కర్ల జీతాల్లో మాత్రం మార్పు లేకుండా పోయింది. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలంటూ లస్కర్లు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకకోవడం లేదు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకపోవడంతో లస్కర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

సిఎంను కలిసినా ప్రయోజనం శూన్యం

తమకు జీతాలు సకాలంలో చెల్లించాలంటూ లస్కర్లంతా నవంబర్ 21వ తేదీన నరసాపురం పర్యటనకు విచ్చేసిన సిఎంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇది జరిగి దాదాపు మూడునెలలు కావొస్తోంది. ఇప్పటి వరకూ కనీస చర్యలు సైతం లేకుండా పోయాయి. సిఎం దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో లస్కర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసలు జీతాలు ఇస్తారా అన్న అనుమానం సైతం నెలకొంది. జనవరి 20వ తేదీ తర్వాత వంతుల వారీ విధానం అమల్లోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. వంతుల వారీ విధానంలో పంటలకు సక్రమంగా నీరందిచడంలో లస్కర్లదే కీలక పాత్ర. జీతాలు లేకుండా ఆకలిబాధలతో విధులు ఏ విధంగా నిర్వహించాలో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. వెంటనే లస్కర్లకు జీతాలు విడుదల చేసి ఆర్థిక కష్టాలు తొలగించాల్సి ఉంది.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రభుత్వ భూములను గిరిజన పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని, అన్యాక్రాంతంగా ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బుట్టాయగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 614లో 4.96 సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా 2020లో గుర్తించి అప్పటి తహాశీల్దార్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేస్తారనుకుంటే గిరిజనేతరులే ఆక్రమించుకున్నారన్నారు. ప్రభుత్వ భూమిలో చెరకు, పశువుల దాణా పంటలు వేశారన్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లస్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహాశీల్దార్ ఎస్.శారాశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్, మండల కార్యదర్శి పోలోజు నాగేశ్వరావు, చోడెం దుర్గ, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎ.ఫ్రాన్సిస్, ఉమామహేశ్వరి, కొనుతుల ముత్యాలమ్మ, కె.నాగమణి పాల్గొన్నారు.

తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పేదలు

పోలవరం నిర్వాసితులకు 'ఉపాధి' చూపాలి

ఆర్‌డిఒ కార్యాలయం ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

2013 భూసేకరణ చట్టం అమలు చేసి నిర్వాసిత కాలనీల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పోలవరం నిర్వాసిత కాలనీ వ్యవసాయ కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2013 భూ సేకరణ చట్టాన్ని, 2018 హైకోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలన్నారు. కూలి పనుల ఆధారంగా జీవిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద కూలీలు పనులు కోల్పోయి నిర్వాసిత గ్రామాల్లో ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం అమలు చేసి నిర్వాసితులుగా గుర్తించాలన్నారు. భూసేకరణ చట్టం వచ్చి పదేళ్లు కావొస్తున్నా హైకోర్టు ఆర్డర్ వచ్చి ఇప్పటికి ఐదేళ్లు కావొస్తున్నా వ్యవసాయ కూలీలను నిర్వాసితులుగా నమోదు చేసి పరిహారం అందించకపోవడం చాలా బాధాకరమన్నారు. వ్యవసాయ కూలీలను బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఆదుకోవాలని, 18 ఏళ్లు నిండిన వ్యవసాయ కూలీలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రాజు, కె.ఝాన్సీదుర్గమ్మ, వెంకాయ్యమ్మ, శాంతకుమారి, విమల, కె.దుర్గారావు, రమేష్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, నాయకులు

ఆందోళన చేస్తున్న హమాలీలు

హమాలీల కూలిరేట్లు పెంచాలని నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ హమాలీల కూలి రేట్లు పెంచుతూ చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని, ఈ మేరకు జిఒ సైతం విడుదల చేయలేదని పౌరసరఫరాల సంస్థ మండల గోదాముల హమాలీల సంఘం విమర్శించింది. ఈ మేరకు పాతూరు వద్దగల మండలస్థాయి గోదాముల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో హమాలీల వర్కర్స్ యూనియన్ నిరసన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా హమాలీల జట్టు మేస్త్రి మత్తే ప్రసాద్ మాట్లాడుతూ పౌరసరఫరాల సంస్థ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రేట్లు పెంచుతూ జిఒ విడుదల చేసి అమలు చేస్తుందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మూడు సంవత్సరాల అయినా నేటికీ అలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇదే క్రమంలో హమాలీలకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, యూనిఫారాలు ఇవ్వాలని, పిఎఫ్ నమోదులో కొత్త సభ్యులకు స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు గడ్డి సూర్యారావు, నాగేశ్వరరావు నాయకత్వం వహించారు.

టిడిపి నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రోడ్డు నిర్మించాలని టిడిపి నిరసన

అడ్డుకున్న పోలీసులు - పలువురు అరెస్టు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం నుంచి మైసన్నగూడెం-శ్రీనివాసపురం రోడ్డు నిర్మించాలని కోరుతూ శ్రీనివాసపురం సెంటర్ నుంచి ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వరకు టిడిపి ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. శ్రీనివాసపురం సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఈ నిరసన ర్యాలీరని ప్రారంభించారు. ఈ పాదయాత్రను ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి నిరసన ర్యాలీ చేయడానికి అనుమతి లేదని సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ సాగర్ బాబు లు సూచించారు. శాంతియుతంగా సమస్యను ఎంఎల్ఎకి తెలియజేయడానికి వెళ్తున్నామని టిడిపి నాయకులు చెప్పే ప్రయత్నం చేశారు. గతంలో ఎంఎల్ఎ ఎలిజా మూడు నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తారని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామ్ చంద్ర శేషుతో పాటు మరికొందరు టిడిపి నేతలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో అక్రమ అరెస్టులను ఖండించాలని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద టిడిపి నేతలు నినాదాలు చేసి ఆందోళన చేపట్టారు. అక్రమ అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, వేములపల్లి శ్రీనివాస్, గొల్లమందల శ్రీనివాస్, కోనేటి చంటి, తడికల మోహన్, నూనె పల్లారావు ఉన్నారు. నిరసన కార్యక్రమంలో నాయకులు ఆకుమర్తి రామారావు, కుక్కల మాధవరావు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సౌభాగ్యవతి, కరుటూరి రమాదేవి, ప్రమీల, భూస సత్యనారాయణరెడ్డి, రామకృష్ణ, గడ సుబ్రహ్మణ్యం, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరు కార్పొరేషన్‌లో అవినీతిపై విచారణ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలకు సంబంధించిన వార్తలు తరచూ పత్రికల్లో వస్తున్నాయని, ఇప్పటికైనా దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో సమగ్ర దర్యాప్తును జరిపించి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆయిల్ కుంభకోణం, ఆసీల కాంట్రాక్టు కుంభకోణంపై అధికార పార్టీకి చెందిన సొంత కార్పొరేటరే ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో ఆ కార్పొరేటర్ స్వయంగా మేయర్, కమిషనర్‌పైనే ఆరోపణలు చేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ అవినీతి ఆరోపణలపై జెసితో విచారణకు ఆదేశించామని చెప్పారని, కానీ ఇప్పటి వరకూ ఆ విచారణ ఏమైందో ఎవరికీ తెలియదన్నారు. నేడు తాజాగా మున్సిపల్ కార్పొరేషన్‌లో జనన, మరణ డిపార్ట్‌మెంట్‌లో అవినీతి జరుగుతున్నట్లు పత్రికల్లో వార్తలొస్తున్నాయన్నారు. ఒక జనన మరణశాఖలోనే కాదని, మునిసిపల్ కార్పొరేషన్‌లో ఆయా శాఖలలో పదేపదే పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. కాబట్టి ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, అవినీతిని అరికట్టాలని కిషోర్ డిమాండ్ చేశారు. నగరంలో మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలు విద్య, వైద్యం పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, కుక్కల బెడద, ఇళ్ల పట్టాలు, టిడ్కో నివాసాలు వంటి అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, అధికారపాలక వర్గం అవినీతి అక్రమాలు మానుకుని ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. ఇంకా ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు బి.సోమయ్య, వి.సాయిబాబా, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్, వివివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు పాల్గొన్నారు.

ప్రతి పక్షాల గొంతు నొక్కడానికే జిఒ1: టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతి పక్షాల గొంతునొక్కడానికి వైసిపి ప్రభుత్వం జిఒ 1 తెచ్చిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి విమర్శించారు. ఈ జిఒను ఉపసంహరించుకోవాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో టి.నరసాపురంలో సోమవారం జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు సభలకు వచ్చే ఆదరణకు భయపడి సిఎం జగన్ చీకటి జిఒ తెచ్చారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల సభలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. కార్పొరేషన్ నిధులు నవరత్నాలకు మళ్లించి ఆయా వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షపార్టీలన్నీ ఏకం కావడంతో జగన్ వెన్నులో వణుకు మొదలైందన్నారు. రాష్ట్రంఅన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, నాయకులు బొంతు సత్యనారాయణ, కొల్లి రమేష్, ఆచంట సూర్యనారాయణ, కొండపల్లి రవి, పద్దిన సత్యనారాయణ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

మిర్చి రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - చాట్రాయి

నూజివీడు డివిజన్ పరిధిలోని చాట్రాయితో పాటు పలు మండలాల్లో మిర్చి పంటలకు తామర, నల్లి పురుగుల వల్ల నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వాలని ఎపి రైతు సంఘం అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహం డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పంటలను పండిస్తున్నారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తెచ్చిన అప్పులు తీర్చలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో మిర్చి పంట సాగులో తామర, నల్లి పురుగుల వల్ల పంట పూర్తిగా పాడై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులకు ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి రాజు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోకి అనుమతి నిరాకరణ దారుణం

కెఆర్ పురం ఐటిడిఎ వద్ద విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోకి ఇతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ గిరిజన సంక్షేమ అధికారులు ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి ప్రజా సంఘాలు, పిడిఎస్‌యు, పివైఎల్, ఎఐకెఎంఎస్, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం, ఆదివాసి కొండరెడ్ల సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం కెఆర్ పురం ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి నాయకులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ అధికారులు జువైనల్ జడ్జిమెంట్ ఆధారం చేసుకుని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోకి ఇతరుల ప్రవేశం లేదని సర్క్యులర్ జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సర్క్యులర్‌ను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకూ చదువుకుంటున్న మినీ గురుకులాలుగా నడుస్తున్నాయన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల విద్యాసంస్థలకు దూరమై డ్రాపవుట్స్ పెరిగే ప్రమాదం ఉంటుందన్నారు. అందుకే గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలుగానీ విద్యాసంస్థల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అనుకూల పరిస్థితులను ఆధారంగా పాఠశాల కొనసాగింపు ఉండాలని నాయకులు కోరారు.

అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్, పివైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబూరావు, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కొవ్వాసు గోవిందరాజు, గిరిజన సంఘం మండల నాయకులు కారం భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, ఆదివాసి కొండరెడ్ల సంఘం నాయకులు పట్ల రమేష్ రెడ్డి, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు బసవరాజు మాట్లాడారు. తొలుత ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐటిడిఎ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

మా సొమ్ము మాకు ఇవ్వండి

ఐసిఐసిఐ బ్యాంకు వద్ద పురుగు మందు డబ్బాతో ఖాతాదారుల నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ కుటుంబం డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి ఇవ్వాలని ఖాతాదారులు స్థానిక ఐసిఐసిఐ బ్యాంక్ వద్ద పురుగుల మందు డబ్బాతో నిరసన చేపట్టారు. తాము డిపాజిట్ చేసిన రూ.ఐదు లక్షలు ఇవ్వాలని ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన వేముల దుర్గారావు కుటుంబ సభ్యులు ఐసిఐసిఐ బ్యాంకు వద్ద పురుగు మందు డబ్బాతో సోమవారం ఆందోళన చేపట్టారు. తన భార్య పేరున ఉన్న రూ.ఐదు లక్షలను తన పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారని దుర్గారావు చెప్పారు. ఇటీవల ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజరు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో తన డబ్బులు ఇవ్వకుండా బ్యాంకు చుట్టూ తిట్టుకుంటూ ఇబ్బంది పెడుతున్నారని ఖాతాదారుడు వేముల దుర్గారావు వాపోయారు. ఈ క్రమంలో మరికొందరు ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరి తమ సొమ్ములు కూడా తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓ దశలో బాధిత ఖాతాదారుడు వేముల దుర్గారావు బ్యాంకు షట్టర్లను మూసివేసి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని నిరసనకు దిగాడు. దీంతో స్థానిక పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరి బ్యాంకు సిబ్బందిని బయటకు తీసుకువచ్చారు. ఖాతాదారుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ కష్టపడి దాచుకున్న డబ్బులను ఇవ్వకుండా ఇబ్బంది పెడితే తన కుటుంబ సభ్యులతో సహా బ్యాంకు ముందు ఆత్మహత్య చేసుకుంటామని తెలిపారు. దీంతో బ్యాంకు ఉన్నతాధికారులను సంప్రదించి డిపాజిట్ చేసిన డబ్బులు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తామని బ్యాంక్ సిబ్బంది సూచించారు. ఇటీవల బ్యాంక్ మేనేజరు ఆకస్మిక మృతి వల్ల జాప్యం జరిగిందని తెలిపారు. దీంతో ఖాతాదారులు తగినంత త్వరగా తమ సొమ్ములు ఇవ్వాలని కోరుతూ ఆందోళన విరమించారు.

బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న దుర్గారావు కుటుంబసభ్యులు

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అక్రమ కట్టడాలు కట్టి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న జివి మాల్, శ్రీనివాస షాపింగ్ మాల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లడుతూ షాపింగ్ మాల్స్ వద్ద ట్రాఫిక్ సమస్య వల్ల పట్టణంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతి పత్రం అందించారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకరరావు, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జూదాలు వద్దు - క్రీడలు ముద్దు

కలిదిండిలో...

ప్రజాశక్తి - కలిదిండి

సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నియోజకవర్గ స్థాయి షటిల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడలు దోహదపడతాయన్నారు. కైకలూరు రూరల్ సిఐ వైవిఎల్.నాయుడు, ఎస్ఐ మణికుమార్, ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచులు మసిముక్కు మారుతీప్రసన్న, సానామీనా సరస్వతి, బత్తిన ఉమా మహేశ్వరరావు, గద్దె ఆనంద్, మహాదేవ విజయబాబు, ఎఎంసి ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, నాయకులు నంబూరి శ్రీదేవి, పాము వీర వెంకట రవి కుమార్, స్టేషన్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : నేటి యువత జూదం, కోడిపందేలు, పేకాట గుండాటలకు దూరంగా ఉండేలా సాంప్రదాయ క్రీడలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వన్‌టౌన్ సిఐ ఆదిప్రసాద్ పిలుపునిచ్చారు. వివిధ రకాలైన క్రీడా పోటీలను పోలీసు వారి ఆధ్వర్యంలో నిర్వహించడం ఎంతో శ్రేయస్కరమని ఆయన చెప్పారు. ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో గుడిపూడి రాము స్మారకార్థం నిర్వహిస్తున్న సంక్రాంతి క్రీడా సంబరాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వారు తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఏలూరు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ టోర్నమెంట్ ప్రాంభించడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో చాటపర్రు గ్రామ సర్పంచి గుడిపూడి రఘు, గ్రామ ప్రజలు సుమారు 200 మంది పాల్గొన్నారు.

ముసునూరు : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సాంప్రదాయ ఆటలకు మొగ్గు చూపాలని ఎస్ఐ ఎం.కుటుంబరావు, ఎంపిడిఒ జి.రాణి, రెవెన్యూ తహశీల్దార్ దాసరి సుధ కబడ్డీ, వాలీబాల్ పోటీలను సోమవారం ప్రారంభించారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని చర్చి వద్ద పోటీలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి ఆటలకు దూరంగా ఉండాలన్నారు. సాంప్రదాయ ఆటలు ఆడాలని చెప్పారు. పోటీల్లో గెలుపొందినవారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

చింతలపూడి : తెలుగు సంప్రదాయ పండుగ సంక్రాంతి అని, ప్రతిఒక్కరూ పండుగ విశిష్టత గురించి అవగాహన చేసుకోవాలని చింతలపూడి తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎస్ఐ డి.హరికృష్ణ అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి పండుగ ముద్దు జూదాలు వద్దు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో యువత జూదాలు, కోడిపందేల వైపు మొగ్గు చూపకుండా పండుగ విశిష్టత గురించి తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లోని పెద్దలు యువతకు అవగాహన కల్పించాలన్నారు. యువత పెడదోవ పట్టకుండా వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి దోహదపడతాయని చింతలపూడి శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆర్ఐ పార్థసారథి, కో-ఆర్డినేటర్ ఉదయ్‌భాస్కర్, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి గురవమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరులో...

ఆగిరిపల్లి : ఉన్నతాధికారుల ఆదేశానుసారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆగిరిపల్లి పోలీసుశాఖ ఆధ్వర్యంలో జూదక్రీడలు వద్దు-సంప్రదాయక్రీడలు ముద్దు అనే నినాదంలో భాగంగా ఆగిరిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను ఆగిరిపల్లి ఎఎస్ఐ తావిరియా నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిడి రాందాసు, వైసిపి నాయకులు ఆర్.వెంకటనారాయణ పాల్గొన్నారు.

మద్దాల పెద్దిరాజుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం


సత్కారం అందుకుంటున్న పెద్దిరాజు

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లి గ్రామానికి చెందిన తెలుగు సాహితీవేత్త, కవి డాక్టర్ మద్దాల పెద్దిరాజు అంతర్రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందటం అభినందనీయమని సర్పంచి షేక్ రహీమా బేగం హసేన అన్నారు. డాక్టర్ మద్దాల పెద్దిరాజు సామాజిక స్పృహ కల్పించే కవిత్వం, వ్యాసాల రచన, వృత్తి రీత్యా ఉపాధ్యాయులకు రావడంతో విద్యార్థులకు తెలుగు భాషాభిరుచిని కలిగించే సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించడం కారణంగా తెలుగుతేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారం-2023కు ఎంపికయ్యారని సర్పంచి తెలిపారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన నల్గొండ జిల్లా చిట్యాల వేదికగా పనిచేస్తున్న పుడమి సాహితీ వేదిక నాలుగో వార్షికోత్సవం పురస్కరించుకుని డాక్టర్ మద్దాల పెద్దిరాజు సాహితీ రంగానికి చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా సదరు అవార్డును స్వీకరణకు ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు ఆదివారం చిట్యాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక ఛైర్మన్ డాక్టర్ చిలుముల బాల్ రెడ్డి అప్పటి పూర్వ కవులు ఏనుగు లక్ష్మణకవి, శ్రీనాథ మహాకవి, గిడుగు రామ్మూర్తి పంతులు, కవయిత్రి మొల్లల ప్రస్తుత వారసులుగా కొనసాగుతున్న నలుగురు ప్రముఖులతో కలిపి డాక్టర్ మద్దాల పెద్దిరాజును సత్కరించి అవార్డును అందించారని తెలిపారు. ఈ మేరకు తనకు ప్రదానం చేసిన అవార్డుతో పోలసానపల్లి సర్పంచి దంపతులను డాక్టర్ మద్దాల పెద్దిరాజు సోమవారం వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి మరింతగా కృషి చేయాలని సర్పంచి దంపతులు డాక్టర్ మద్దాల పెద్దిరాజును కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త షేక్ హసేన పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఎంఇఒ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామైక్య సంఘాల కార్యాలయంలో ఉపాధ్యాయులకు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల హాజరు నూరుశాతం తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. అంతేకాకుండా విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి క్రమశిక్షణతో కూడిన విద్యాభివృద్ధి నేర్పాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని రుచికరంగా ఉండేలా వండి పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగనన్న విద్యా కానుకకు సంబంధించి బయోమెట్రిక్‌ను నూరు శాతం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలల అభివృద్ధి నిధులు, విద్యార్థుల హాజరు, విద్య అమృత మహోత్సవం పలు అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఛైర్మన్లు వైవి.మాధవకుమార్, పి.దుర్గాప్రసాద్, కె.కృష్ణమోహన్, జి.వెంకటేశ్వరరావు, జి.కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు.

కోడిపందేలు అరికట్టాలని వినతి

వినతిపత్రం అందిస్తున్న భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

యువత కోడిపందేలు, పేకాట, గుండాటకు ఆకర్షితులై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. సంక్రాంతి నేపథ్యంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ జనార్ధనరావుకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలోని మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి పలు మండలాల్లో సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహిస్తున్నారన్నారు. యువత కోడిపందేల్లో సొమ్ము పోగొట్టుకుని అప్పుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి యువత పెడదోవ పెట్టకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు అప్పారావు, రెడ్డి పాల్గొన్నారు.

జూద క్రీడల నియంత్రణకు కమిటీ

మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జూద క్రీడల నియంత్రణకు ప్రత్యేక నిఘా కమిటీ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ జి.ఎలీషా తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిధిలోని పలు శాఖల అధికారులతో కోడిపందేల నియంత్రణకు సోమవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట, గుండాట, కోడి పందేలు ఆడడం చట్ట రీత్యా నేరమన్నారు. ఎవరైనా జూద క్రీడలు ఆడిన, ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రత్యేక నిఘా కమిటీలు నిరంతరం పర్య వేక్షిస్తుంటాయని తెలిపారు. దీనికి సంబధించి కార్యాలయాల్లో కంట్రోల్ నెంబర్ 9440741234 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగతాయారు, ఎఎస్ఐ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు నివాళి

ప్రజాశక్తి - మండవల్లి

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక సెంటర్‌లో ఉన్న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి రైతు సంఘం నాయకులు చేయబోయిన వీర్రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోరి 3648 కిలోమీటర్ల మహా పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకున్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా మేనిఫెస్టోలో నవరత్నాలను పొందుపరిచారన్నారు. ప్రజల భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తున్న జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి ఝాన్సీ, సొసైటీ అధ్యక్షులు శివాలయం ఛైర్మన్ కొల్లా కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రజా సంకల్ప పాదయాత్ర ముగింపు చేసి నాలుగేళ్ళు పూర్తాయిన సందర్భంగా సిఎం జగన్‌కు ముదినేపల్లి వైసిపి నేతలు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, నిమ్మగడ్డ భిక్షాలు, మోట్రు ఏసుబాబు, ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, రాచూరి కుమార్, షేక్ గౌస్, బొర్రా శేషుబాబు, కె.విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపికి కార్యకర్తలే బలమని మాజీమంత్రి పీతల సుజాత అన్నారు. పట్టణంలో టిడిపి నాయకురాలు నాగేశ్వరమ్మ భర్త ఇటీవల మరణించటంతో ఆమె కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలకు టిడిపి ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలందరు చురుకుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు తిరుపతిరావు, వీరేంద్ర, మానేపల్లి రాజారావు పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని అడవినెక్కలం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కె.ఝాన్సీ, ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి పి.వీరబాబు, వ్యవసాయాధికారి చెన్నారావు, ఎంపిటిసి సభ్యులు జి.శ్రీనివాసరావు, గొల్లగూడెం సర్పంచి ఎల్.రమేష్, తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, వైసిపి నాయకులు ఎం.హరిబాబు, జి.హనుమంతరావు, వి.రాజు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : దెందులూరు నియోజకవర్గంలో మోడల్ గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏలూరు మండలంలోని మాదేపల్లిలో ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్‌తో కూడిన ఇళ్లను మోడల్ గృహాలుగా నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్లకు ప్రత్యామ్నాయంగా కొరుకునేవారికి గ్రూప్ హౌసెస్‌గా నిర్మాణలు చేపట్టాలని భావిస్తున్నామన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపిపి పెన్మత్స శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి సభ్యులు మండల సరస్వతి కొండలరావు, దెందులూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ తెర ఆనంద్‌కుమార్, మాదేపల్లి సర్పంచి ప్రభుదేవా, కొల్లేరు బోర్డ్ సభ్యులు పళ్లెం ప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఆహర్నిశలు శ్రమిస్తున్నారని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం, గోకినంపాడు గ్రామాల్లో సోమవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా జగన్ పాలన సాగుతోందన్నారు. ప్రజలంతా మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, పార్టీ మండల కన్వీనర్ ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి పేరే రామకృష్ణ, ఇఒపిఆర్‌డి టివి.సారధి, సచివాలయ కార్యదర్శి లక్ష్మి, గ్రామ మాజీ సర్పంచి అచ్యుత రాంబాబు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో....1

మట్టి అక్రమ తవ్వకాలు నిలుపుదల

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

అక్రమ మట్టి తవ్వకాలపై మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని బొమ్మినంపాడు పవర్‌పేటలో చేవలు చెరువుకు ఆనుకుని పొంది అక్రమ మట్టి తవ్వకాలు చేపడుతుండడంపై యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాలు చేపడుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. టిప్పర్లు, ట్రాక్టర్ల మట్టి రవాణా చేయకుండా నిలుపుదల చేశారు. అనుమతి పొందిన తర్వాత మాత్రమే మట్టి తవ్వకాలు చేపట్టాలని వారిని హెచ్చరించారు. లేకపోతే వాహనాలను సీజ్ చేసి మట్టి తవ్వకాలు చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి తవ్వకాలు పరిశీలించిన వారిలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.శివకుమార్, గ్రామ విఆర్ఒ పి.రాజబాబు ఉన్నారు.

వృద్ధులకు దుస్తులు అందిస్తున్న దాతలు

ముగిసిన 'చాయ్ చమక్'

ప్రజాశక్తి - ఏలూరు

మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బాల వికాస్ భారతి ఆధ్వర్యంలో చాయ్ చమక్ కార్యక్రమం పవర్‌పేటలో ఏపిఆర్ విజ్ఞాన కేంద్రం వద్ద ప్రతి రోజూ నిర్వహిస్తున్నారు. వృద్ధులకు టీ, రొట్టె, పండ్లు, ఉడకబెట్టిన గుడ్లు పలు పౌష్టికాహారాలు అందిస్తున్నారు. ముగింపు కార్యక్రమం 30వ రోజు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వికార్ ఏలూరు డియోసిస్, సెయింట్ జాన్ ప్రిన్సిపల్ ఫాదర్ బాల, ముఖ్య వక్తలుగా మానవత సంస్థ విద్యానిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం వృద్ధులకు చాయ్ చమక్ కార్యక్రమంలో భాగంగా ఉడకబెట్టిన గుడ్డు, పండ్లు అందించారు. ప్రభుత్వాలు ఇతని కోసం ప్రత్యేకమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారి జీవన ప్రమాణం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సభకు అధ్యక్షత వహించిన బాల వికాస్ భారతి అధ్యక్షులు, న్యాయవాది కట్టా సత్యనారాయణ అన్నారు. ఏపిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జివిఎల్.నరసింహరావు వాల్ ఆఫ్ కైండ్ ఫౌండర్ ఆర్‌వి.రమణ, మానవత సంస్థ నాయకులు పి.రత్నాకర్, మానేపల్లి రామారావు, లయన్స్ క్లబ్ సభ్యులు, వృద్ధులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 30 రోజులు చాయ్‌చమక్ కార్యక్రమంలో వృద్ధులకు సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలు, పండ్లు ముఖ్యఅతిథిగా, ముఖ్య వక్తలుగా పాల్గొన్న ఫాదర్ బాలా, ఆలపాటి నాగేశ్వరరావు అందించారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధికారి రవీంద్ర సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో జిల్లాలోని విద్యా వ్యవస్థకు సంబంధించిన అధికారులు చాట్రాయి మండలంలోని వివిధ పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రవీంద్ర ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. జగనన్న విద్యా కానుక కిట్ల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోలి సత్యనారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విద్య బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చాలని తెలిపారు. పాఠశాలను తనిఖీ చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

తమకు శ్మశాన వాటిక లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన దళితులు స్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దళితవాడలో శ్మశానవాటిక లేకపోవడంతో దహన కార్యక్రమాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమకు ప్రత్యేకమైన శ్మశానవాటికకు స్థలాన్ని చూపించాలని స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావుకు అర్జీ సమర్పించారు. పర్వతాపురం గ్రామస్తులు కల్లేపల్లి రాజేష్, మహేష్ తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపిపి రాంబాబు తెలిపారు. మండలంలోని యరగుంటపల్లి పంచాయతీ ఎంపిటిసి-1 బిసి ఏరియాలో ఎంపిపి నిధులు సుమారు రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధిలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, వైస్ ఎంపిపి, నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వాపోతున్న బాధితులు

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని అంకన్నగూడెం పంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో తాటకిల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సోదెం రాములమ్మ ఆమె కుమారులతో కలిసి తాటాకింట్లో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం వారు పొలంలో పని నిమిత్తం వెళ్లారు. ఆమె ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు చూసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అదుపు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వాహనం వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలిపారు. ఇంట్లో కొంత నగదు, పొలానికి సంబంధించిన కాగితాలు పూర్తిగా కాలిపోయాయని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

కోడి కత్తులు స్వాధీనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో ఓ వ్యక్తి వద్ద పోలీసులు 60 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్‌కు అందిన సమాచారం మేరకు మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో సోమవారం ఆయన తనిఖీ చేసి గ్రామానికి చెందిన బాలిన గంగాధరరావు వద్ద 60 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చింతలపూడి :మండలంలోని చింతంపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి కాంతారావు వద్ద 125 కోడి కత్తులను ఎస్ఐ హరికృష్ణ స్వాధీనం చేసుకున్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

ప్రగడవరం గ్రామానికి చెందిన కె.మరియమ్మ వద్ద 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుఇన వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పల్లెల్లో హరిదాసుల సందడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

హరిదాసులు రాకతో పల్లెల్లో సక్రాంతి సందడి నెలకొంది. సంక్రాంతి అనగానే మనకు గుర్తొచ్చేవారు హరిదాసులు. పలుకే బంగారమాయేనా కోదండ రామా.. పలుకే బంగారమయేనా అని పాడుతూ ఒక చేతిలో చిడతలు, భుజంపై తంబుర, తలపై అక్షయ పాత్రతో ముందుకు కదిలిపోయే హరిదాసుల సందడి గ్రామాల్లో మొదలైంది. వారి రాకతో ఆయా పల్లెల్లో సంక్రాంతి శోభ వచ్చింది. పాటలు పాడుతూ ప్రజలను రంజింప చేసి ధాన్యం, బియ్యం, ఇతర రూపాల్లో భృతి పొందుతారు. ధనుర్మాసమంతా హరిదాసులు ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో, తిరుగుతారు. పిల్లలందరూ ఉత్సహంగా, హరిదాసుల వెంట వెళ్తూ సందడి చేస్తారు. పెద్దలు మాత్రం ఇంటికి వచ్చిన హరిదాసుకి వివిధ రూపాల్లో తోచింది ఇస్తుంటారు.

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.W.O.P. No 49/2022
మైనర్లు/వారులు:
1) మైలాబత్తుల సాయి సత్య సురేష్, వయస్సు 17 సం॥లు, (పుట్టిన తేది: 02-08-2004), తండ్రి: దుర్గారావు, హిందూ, పురుషుడు, సంరక్షణ, విద్యార్ధి, డోర్ నెం. 2-45/ఏ, రాజవరం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం జెసిజెసి.
2) మల్లాబత్తుల దొర శ్రీ లక్ష్మి నాగ సూర్య నృశింహ సింధు, వయస్సు 15 సం॥లు, (పుట్టినతేది: 03-11-2006), తండ్రి: దుర్గారావు, హిందూ, స్త్రీ, సంరక్షణ, విద్యార్ధి, డోర్ నెం. 2-45/ఏ, రాజవరం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం జెసిజెసి.
Between:
1 శ్రీ మల్లాబత్తుల దుర్గారావు (ప్రతిపాదిత గార్డియన్), తండ్రి: సత్యనారాయణ, నివాసం: డోర్ నెం. 2-45/ఏ, రాజవరం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం జెసిజెసి ...పిటీషనరు
మరియు
1. -నిల్- -రెస్పాండెంట్లు
ఈ దిగువ షెడ్యూలు ఆస్తిలో మైనర్లు/వారులకు గల 2/3వ వంతు హక్కును, వారి చదువు, పోషణ, వగైరా అవసరముల నిమిత్తం విక్రయించుటకు గాను ప్రతిపాదిత గార్డియన్ అయిన మల్లాబత్తుల దుర్గారావు పిటీషనర్ పై నెంబరు గార్డియన్ ఓ.పి. నెం. 49/2022 ను దాఖలు చేసియున్నారు. ఇందుపై ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు/ అభ్యంతరములు వున్న యెడల సదరు పిటీషన్ వాయిదా **తేది. 14-02-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరై తెలియజేసుకొనవచ్చును.
షెడ్యూలు
ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం & సబ్ రిజిస్ట్రీ, గతంలో జంగారెడ్డిగూడెం పంచాయితీ, ప్రస్తుతం జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని ఆర్.యస్. నెం. 567 రు, ప్లాట్ నెం. 21 రు దాఖలా డోర్ నెం. 10-50 రు గల ఇంటికి సమీపమున గల చ॥గ॥ 220లు స్థలమునకు హద్దులు.
తూర్పు: అ. 36'-0"లు ప్లాట్ నెం. 18 రు దాఖలా స్థలం.
దక్షిణం: అ. 55'-0"లు ప్లాట్ నెం. 22 రు దాఖలా స్థలం.
పడమర: అ. 36'-0"లు 33 అడుగుల వెడల్పు గల రోడ్డు.
ఉత్తరం: అ. 55'-0"లు ప్లాట్ నెం. 20 రు దాఖలా స్థలం.
ఈ హద్దుల మధ్య చ॥గ॥ 220 లు ఖాళీ స్థలము, ఇందలి సర్వం సహా, ఇందలి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
ఏలూరి గోపాలకృష్ణ
పిటీషనరు తరపు న్యాయవాది
స్థలం: కొవ్వూరు కొవ్వూరు
తేది:27-12-2022 సెల్: 9441554144

మహారాజశ్రీ భీమవరం 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
E.A.No. 282/2022, E.P.No. 16/2019 in O.S.No. 34/2018
బిట్వీన్:
దారపురెడ్డి వీరాస్వామి ...క్లెయిమ్ పిటీషనరు
అండ్
1) M/s. గాయత్రి ఆక్వాటెక్, ఆకివీడు, Rep. by. పార్టనర్ కలిగోట్ల సత్య వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు (డి.హెచ్.ఆర్)
2) దారపురెడ్డి కనకయ్య, తండ్రి: వీరాస్వామి, హిందూ, వయస్సు 55 సం॥లు, చినకాపవరం, ఆకివీడు మండలం (జె.డి.ఆర్)
...రెస్పాండెంట్లు
పై నెంబరు ఇ.పి.లో పిటీషనరు క్లెయిమ్ పిటీషన్ను దాఖలు చేసుకొనగా సదరు పిటీషనులో మీలో 2వ రెస్పాండెంటు అయిన దారపురెడ్డి కనకయ్య గార్కి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపించిననూ బుద్ధిపూర్వకంగా తీసుకొనక గ్రామంలో లేకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదురు పిటీషన్ను శ్రీ కోర్టు వారు **ది.06-02-2023 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
జి.రోనాల్డ్‌రాజు
పి.జె.పి.కెనడి
అడ్వకేట్స్, బేతనిపేట,
భీమవరం, భీమవరం.
09-1-23. సెల్: 93473 04911

మహారాజశ్రీ భీమవరం 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
E.A.No. 283/2022, E.P.No. 16/2019 in O.S.No. 34/2018
బిట్వీన్:
దారపురెడ్డి వీరాస్వామి ...క్లెయిమ్ పిటీషనరు
అండ్
1) M/s. గాయత్రి ఆక్వాటెక్, ఆకివీడు, Rep. by. పార్టనర్ కలిగోట్ల సత్య వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు (డి.హెచ్.ఆర్)
2) దారపురెడ్డి కనకయ్య, తండ్రి: వీరాస్వామి, హిందూ, వయస్సు 55 సం॥లు, చినకాపవరం, ఆకివీడు మండలం (జె.డి.ఆర్)
...రెస్పాండెంట్లు
పై నెంబరు ఇ.పి.లో పిటీషనరు స్టే (Stay) పిటీషన్ను దాఖలు చేసుకొనగా సదరు పిటీషనులో మీలో 2వ రెస్పాండెంటు అయిన దారపురెడ్డి కనకయ్య గార్కి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపించిననూ బుద్ధిపూర్వకంగా తీసుకొనక గ్రామంలో లేకుండా కాలయాపన చేయుచున్నారు. కావున సదురు పిటీషన్ను శ్రీ కోర్టు వారు **ది.06-02-2023 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
జి.రోనాల్డ్‌రాజు
పి.జె.పి.కెనడి
అడ్వకేట్స్, బేతనిపేట,
భీమవరం, భీమవరం.
09-1-23. సెల్: 93473 04911